క ని వి పం చి

"విజయ"

ఆమె! ... ఆమె ఏకాకి! ... నావారంటూ గుప్పెటలోని యిసుక రేణువుల్లా యనేకమందియున్నా ఆమె ఏకాకి! ... స్వరాలు పలుకని విపంచి ... పరిమళంలేని పుష్పం ... ఆమెతో ఎవరూ మాట్లాడరు ... కనీసం పలుకరించనైనా పలుకరించరు. ఆమె యూహిస్తుంటుంది ... కలలు కంటుంటుంది, ఎవరైనా తనతో మాట్లాడితే; తనను యవ్యాజంగా పలుకరించితే తియ్యగా తన హృదయంలో వీణమీటినట్లుంటుంది!! ... కాని యంతలోనే నిరాశ. ఆమె వూహాలన్నీ నీటిమీది యలలు ... తనకి తానే జవాబు చెప్పుకుంటుంది. మాట్లాడితే, పలుకరిస్తే, తనేంచేయగలదు. ... వాళ్ళేం మాట్లాడి ఆనందిస్తారు మాట్లాడలేని తనతో మాట్లాడి? ... స్వరరహితమునైన తీగల్ని కదిలించినట్టే. కారణం! ఆమె మూగది ... యొక్క మాటలోతప్ప తక్కిన విధాల యామెలోని లోటు వెదకడానికి కనీసం యొక యుగంపడుతుంది. ఆమె యందం యనిర్వాచనీయం, కాని అది నిరాధరమైంది. ఆమెది జాలిగుండె! ఎవరికైనా కష్టాలువస్తే యామె చూడలేదు. కాని ఆమె సానుభూతి, సహాయం నిగ్రాంచనీయాలు. తల్లిదండ్రులు ... తోడబుట్టిన చెల్లెండ్రైనా మాట్లాడరు. కనీసం యొక్కమాట, యొకేయొకమాట మాటాడరు ... అదే ఆమె చింతకు కారణం, లోలోనే కుమిలిపోతుంది. తండ్రి యామె పదుమూడేళ్ళవరకు యొక విధమైన యాదరంతో చూసేవాడు. దగ్గర కూర్చోబెట్టుకుని రామాయణం, భారతం, భాగవతం చదివి వినిపించేవాడు. వ్రాయను నేర్పినాడు ... కాని యీ యనురాగం, యాదరణ యంతా యామె పదునాల్గవయేడునుంచి ఏమయిపోయిందా! యనిపిస్తుంది. ఆమె వయస్సు హెచ్చినకొలది, అతనిలోని ప్రేమ విలువ తగ్గజొచ్చింది. ... ఆమె చెల్లెండ్రకొక గుదిబండై కూర్చుంది ... ఆమెకు పెళ్ళికానిది వాళికవదు ... ఆమె కిప్పుడు పందొమ్మిది వసంతాలు. మొదటి చెల్లెలు వాణికి పదునేడేళ్ళు రెండవ చెల్లెలు వేణికి పదునైదేండ్లు... కాని ఆమెకి పెళ్ళికాదు; వేలకువేలు కట్నం గుమ్మరిస్తే - ఏమూసిలాడితోనో, పడుచాడితోనో, మధ్యవయస్కునితోనో పెళ్ళైపోవచ్చు, కాని హరిహరరాయుని ఆస్థంతా కలిపి అమ్మినా మూడొందలు ఖరీదు చెయ్యదు. ఈ సమస్యే తండ్రినుండి యామె విముఖత్వానికి కారణం.

ఇక తల్లి సంగతి, చెల్లెండ్ర సంగతి సరేసరి. వాళ్ల సౌఖ్యస్రవంతిలో ఆమె యొక విరిగిపడిన వృక్షంలా యడ్డంకియని వాళ్ల యుద్దేశం. ... ఆమెనెవరూ పలుకరించరు. కాని ఆమె అందరికి కావాలి. ఆమె సహాయం ప్రతివారికి కావాలి ... వారందరికి ఆమె సేవలు చేయాలి. చేస్తుందికూడ! ... ఎవరేది చెప్పినా కాదనే స్వభావం, ఎదిరించే యహంభావం యామెలో వెతికినా దొరకవు. అదే ఆమెలోని యలౌకిక ప్రవృత్తి ... ప్రక్కింటి నాయుడుగారి కోడిపుంజు కమ్మని నాదముతో ఆమె మేల్కొంటుంది ... ముందుగా లేగదూడల్ని విప్పి తల్లిదగ్గర విడిచిపెడుతుంది. తర్వాత వీధిలోకివెళ్ళి వీధివాకిలి యూడుస్తుంది. కల్లాపు జల్లుతుంది. పెరడంతా యూడుస్తుంది ... బావి దగ్గరి రెండు తొట్లనిండా నీళ్లు చేదుతుంది ... అక్కడ పడేసిన యంట్లపాత్రలన్నీతోమి, వంటింట్లో సర్దుతుంది ... అప్పటికి అందరూం నిద్రనుండిలేస్తారు. అందరికి తోముపుల్లలు, నీళ్లు యందించి, ఆవుల దగ్గర పాలు పితుకుతుంది. తర్వాత స్నానపానాలలో చెల్లెండ్రకీ, తండ్రికీ, తల్లికి తోడ్పడుతుంది. అక్కడితో రెండు తొట్ల నీళ్లు కాళీయైపోతాయి. విడిచిన బట్టలు

కుప్పగా తయారవుతాయి. వాటి నన్నిటిని యతికి యారవేసి, మళ్ళా రెండు తొట్లనిండా నీళ్లు చేదుతుంది. అప్పటికి ఆమె మొదటి కార్యక్రమం ముగుస్తుంది. వంటింటి దగ్గరకు వెళ్ళి గుమ్మంమీద తల్లి పెట్టిన ఫలహారము, అది యొకొక్కప్పుడు యందరకూ పెట్టగా మిగులుతేనే ఆమెకుముడుతుంది లేక పోయిననాడు లేదు. వట్టి కాఫీ తీసుకుంటుంది ... పలహారమున్న నాడు దానిని తీసుకుని పశువులశాల లోనికి వెళుతుంది. ఆమె వస్తూందనగా అవి మెడలో గంటలు గలగలలాడేటట్లుగా తలలూచి ఆమెకు స్వాగతాలు పల్కుతవి. ఆమె చేతిలోని ఫలహారాన్ని కొంచెం కొంచెంగా వాటికి బెడుతూ తను తింటూంటుంది ... ఆ పని ముగియగానే బిందె తీసుకుని చెరువుకి బయలుదేరుతుంది. అక్కడ ఆమెను చూచి అమ్మలక్కలు వేళాకోళాలు, పెడనవ్వులూ పరిహాసాలు ప్రారంభమవుతాయి. ఆ యపస్వరాలు యామె కాళీబిందెకుతగిలి యామె హృదయంలో బాధగా ప్రతిధ్వనించేవి. ఆమె వారినేమీ యన లేదు ... అనదుకూడ! ... జాలిగా అందరివైపు యొకేయొక చూపు చూసేది - దాంతో మళ్ళీ నవ్వులు పువ్వులులా రాలేవి. ఆమె మారు మాటాడకుండా నీళ్ళు యెత్తుకుని యింటికివచ్చేది. దారిలో శివాలయపు పూజారి ఆమె నప్యాయంగా పలుకరించి, ప్రేమగా శిరసునిమిరి, రెండరటిపళ్లు యిచ్చేవాడు. ఆమెయంటే, ఆ మాత్రమైనా ఆదరము చూపేది అతనే. ఆప్యాయతతో గతబాధలన్ని యామె మరచిపోయేది. యింటికివెళ్ళి బిందెనుదించి పెరటిలోనికేగేది. తాదెచ్చిన అరటిపళ్లు ఆ పశువులకు బెడుతూ యనిర్వచనీయానందాన్ని యనుభవించేది... ఆమెకు తల్లి, దండ్రి, మిత్రుడు, తోడు, నీడ యన్నీ యవే ... వాటి సాన్నిధ్యంలో, వాటి పరిచర్యంలో ఆమె హృదయం ఆనంద డోలికలనూగేది...ఆమె హృదయం నిర్మలమైనది, నిశ్చలమైనది. ఆ హృదయాలయంలో యా పశువుల స్వరాలు గుడిగంటల స్వరాలుగా రవళించి, యాలయమంతా సంతోషంతో మారుమ్రోగేది ... అలాగే మధ్యాహ్నం అందరి భోజనాలు యయ్యేవరకూ గడిపేది...అందరూ తిన్న తర్వాత వంటింట్లో తన నిమిత్తం పాత్రలోయుంచిన భోజనాన్ని తెచ్చుకుని తిని హాయిగా యక్కడే పడుకునేది తీయతీయని కలలుకంటూ. మధ్యాహ్నం మూడుగంటలవుతుంది. లేచి యింట్లోని అంట్లన్నీ తెచ్చితోమి నీళ్ళుతోడి, చెరువుకెళ్ళి నీళ్లుతెచ్చి యక్కడికాపని పూర్తిచేస్తుంది ... ఆమె కెవరూ అలంకారం చెయ్యరు. అలంకారానికి ఆమెకు ఏమీయుండవు. ఉన్నా, అనవసరమనిపిస్తుంది.

చక్కగా తలదువ్వుకునేది, యుతికినచీర కట్టుకునేది. పశువులని తీసుకుని నదియొడ్డుకి బయలుదేరేది ... తప్పటడుగులువేస్తూ ముందుకీ వెనక్కీ చూస్తూ నడిచే ఆ పశువుల సందడి ' ఆమె హృదయంలో మహా సంరంభంగా యుండేది. అవి ఏదో మాట్లాడుతున్నట్లు, ఏదో చెప్పుతున్నట్లు, వెనక్కి తిరిగి ఆమె ముఖంలోకిచూసి యుత్సాహంగా ముందుకు సాగిపోయేవి ... కాలవవార చెట్లదగ్గర నాలుగుకొమ్మలుకోసి వాటి ముందుపడేసి గట్టు మీద యొకచోట కూర్చునేది. అవి ఆ ఆకులుతింటూ, పరిసరాలలో షికారుచేస్తూ మిత్రురాలికి కాస్త విశ్రాంతి నిచ్చేవి ... ఆమె యలా యా నదియొడ్డున కూర్చుండి కదిలే అలలని, మెదిలే చిరుచేపలనీ చూస్తుండేది. ఆమె దగ్గరకి ఎవరూ వెళ్ళేవారు కారు. చిన్న పిల్లలు సరదాగా ఆమె ముఖంలోని కళను చూచి దగ్గరకిరాగా, తలిదండ్రులు బెదిరించి రానియ్యకుండా జాగ్రత్తపడతారు. ఆమెకదే మనసులో బెంగగా నుండేది. తన దగ్గరకి పసిపిల్లల్ని గూడ యెందుకు రానియ్యరు? తనేం చేస్తుందని? ... నిశ్చలంగా చిరుకెరటాలలో ప్రతిఫలించే తన రూపాన్ని చూసుకుని ఆమెలోని కోర్కెలు రేకెత్తినట్లై ఒక గులకరాయి తీసుకుని ఆ రూపంమీదికి విసిరేది. అటుయిటు నీటిలో కదిలే తన రూపాన్ని, చెదిరే సుడులనీ ఆసక్తితో ఆనందంతో చూసేది. ఆ ఆనంద సమయంలో గోపాలు డక్కడికి వచ్చేవాడు. అతని పశువులు ఆమె పశువులతో కలిసిపోయేవి. ఆనందాన్ని తాను కొంత పంచుకునేవాడు

... వాడొక అభాగ్యుడు. కన్ను తెరవకముందే తల్లినీ, కన్ను తెరచి తండ్రినీ కోల్పోయాడు. జీవితంలో నా యనే దిక్కు లేక, అల్లరి బిల్లరగా తిరిగే రోజులలో దూరపుబంధు వొకామె చేరదీసి దగ్గర యుంచుకుంది. వాడితోగూడ ఎవరూ మాట్లాడరు, ఎవరూ స్నేహంచేయరు ... కారణం ... కులం, గిలం, జాతి, నీతి, డబ్బు, గౌరవంలేనివాడు ... ఆమెకు మాటలురావు ... వాడికి మాటలువచ్చు. ఊరి బడిపంతులు చదువుతప్ప మరే సంస్కారమూ వాడికిలేదు. కష్టసుఖాలలో ఆమె సలహాలను తప్పకుండా పాటించేవాడు. తావిన్నవి, కన్నవి అన్ని సంగతులు రోజూ యామెతో చెప్పేవాడు. ఆమె ఆనందంతో ఆలకిస్తూ, కళ్లతో సందేహాలు, యనుమానాలు అడిగేది. మరీ పెద్దవియైతే ఇసుకలో వ్రాసి యడిగేది. ఆమె వింటుంటే, ఆమెను చూస్తుంటె వాడి కదొకలాటి ఆనందం. ఆమె దరి యుంటేనే వాడికి స్వర్గంలో యుండినట్లువుంది. ఆ మాటే చాలమార్లు ఆమె దగ్గర యనేవాడు. ఆమె నవ్వేది యంతే ... లోకం వారి ననుమానించదు. అనుమానించలేదుకూడ! కారణం, ఆమె పందొమ్మిదేళ్ల నవయువతి. వాడు పద్నాలుగేళ్ల బాలుడు. ఆమెయంటే వాడికి, వాడంటె ఆమెకి, యనిర్వచనీయమైన మమత ... అలౌకికమైన ప్రేమ; అవ్యాజానురాగం...చీకటిపడేవేళవరకూ ఏవేవో కబుర్లు చెప్పుకునేవారు. ఆమెలేచి నిల్చునేది. "వా! వా! వా!" ఆ పశువులు ఎక్కడయున్నా పరుగెత్తుకుంటూ ఆమె దగ్గరకివచ్చి యాప్యాయంగా యామె కాళ్లను చుట్టుకొనేవి. అతడు తన పశువులని తీసుకొని కొండవాలుగా వెళ్ళిపోయేవాడు. ఆమె వాటిని తోలుకుని యిల్లుచేరేది. ఆమె దినచర్య మామూలే. రాత్రి పెరటిలో జామచెట్టుక్రింద మంచంవేసుకుని పండుకునేది. నిద్రబోయేదికాదు. మెరిసే చుక్కల్ని వెలిగే చంద్రుణ్ణి కదిలే ఆకుల్ని మెదిలే పుష్పాలనిచూస్తూ ఏదో ఆలోచించుకునేది. చెట్టుమీదికి అప్పుడప్పుడు యొక రామచిలుక వస్తూండేది. వచ్చినప్పుడల్లా అది కడుపునిండాతిని, రెండు జామకాయలు ఆమె మంచంమీదరాల్చి యీ విధంగా యొక యభిమానాన్ని చూపేది. ఆమెలేచి యుల్లాసంతో ఆ జామపండ్లనేరి తినేది. "ఓ చిలుకా! ఓ పలుకా! నీకు పలుకువచ్చు. చక్కగా మాట్లాడతావు. కాని నాతో ఎందుకు మాట్లాడవు. నేనంటే నీ కిష్టంలేదా, ఇష్టంలేకపోతే జామకాయల్నెందుకు పడేస్తున్నావు. నీ కెక్కువైపోయా! ... కాదు, కాదు నేనంటే నీకు ప్రేమే! నిజంగా ప్రేమే ... చిలకా నువ్వు అందమైనదానివి, నా కంటేనా, కావు కావు. కాని నీకు రెక్కలున్నాయి, వాటితో నీవు స్వేచ్ఛగా తిరుగుతున్నావు, నా కవిలేవు. అందుకనే నేను యిలా దుఃఖితురాలనైయున్నాను. పకృతి యెంత సుందరమైనది; ఎంత నిశ్శబ్దంలో, ఎంత నిశ్చలమైన ప్రవృత్తి. ప్రకృతీ! నీలో యందముంది, నాలో యందముంది. కాని నీ అందానికుండే సంచలనమూ, నీ ఆనందానికియుండే ప్రతిచలనము నా అందానికి, ఆనందానికిలేవు. మల్లెల సొగసుద్వారా, కలువనవ్వుద్వారా, రోజా సౌరభంద్వారా, వెన్నెల మార్దవంద్వారా, సంధ్య యనురాగంద్వారా నీ అందాన్ని నీ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నావు. కాని నేనెలా చేయగలను. నా అందం నా ఆనందం యిలా నాలోనే యిమిడి నశించవలసిందేనా! ... నిస్వరం విస్మృతం. నిశీథం యగోచరం. ఇంతే ... యివి ఆమె హృదయం పలికే మాటలు. ఇదియు ప్రకృతికితప్ప మరెవ్వరికీ యర్థంకానిభాష...అలా ఆలోచిస్తూ ఏ తెల్లవారుజామునో నిద్రబోయేది ... ఆమె జీవితానికి విశ్రాంతి లేదు, అది నిజం!

♦ ♦ ♦

ఒక నాడు తండ్రి దగ్గరకు పిలిచాడు. ఎందుకు పిలిచాడో ఆమెకర్థంకాలేదు. చెల్లెంద్ర ముఖంలో యదొకలాటి కళద్యోతకమవుతూంది. తల్లి కళ్లలోని వెలుగు నక్షత్రాల్ని మించింది. ఏమీతోచక తండ్రి దగ్గరకు వెళ్లింది. ప్రేమతో దగ్గరకు తీసుకుని తల నిమిరి ఏదో చీటీ యిచ్చాడు. ఆమె చదువుకుంది.

ఆమె ముఖమొక్కసారి వివర్ణమైంది. హృదయంలో ఏదో బాధా చిహ్నమైనముసలముకదిలింది. తండ్రి కాళ్ళమీద బడి ఏడ్చింది. ఏదో వ్రాసియిచ్చింది. దాని చదువుకుని యతడు మండిపడ్డాడు. చీదరించుకున్నాడు. ఆమె దుఃఖిస్తూ పశువుల పాక దగ్గరకి వెళ్ళిపోయింది. ఆమె దుఃఖానర్థము చేసుకున్నట్లుగా యవి రోజూలా ఆమెని పలుకరించలేదు. ఆమెయొక రాటకు చేరబడి వెనక్కి చేతులు పెనవైచి ఆకాశంవంకచూస్తూ నిలుచుంది. నీ రెండ ఆమె కపోలాలమీదపడి జారుతున్న కన్నీటి బిందువులు ముత్యాలలా మెరుస్తున్నాయి. పశువులుకూడ తలలు వంచుకుని, మారు స్వరంలేకుండా ఏదోఆలోచిస్తున్నట్టుగా యప్పుడప్పుడు యామెవంకచూస్తున్నై. ఆమె యొక్కమారు తల త్రిప్పి వాటికేసిచూసింది. అవికూడ మోరలుపైకెత్తి ఆమెకేసిచూసాయి. కలుసుకున్నచూపుల్లోంచి భాష్పాలు రాలినై. ఒక్కసారి పెల్లుబికిన హృద్వేగంతో వాటిదగ్గరకువెళ్ళి మెడలని కావలించుకుని, తలలని తన చెంపలకుచేర్చి ఏడ్చేసింది. ఆమెబాధనర్థంచేసుకున్న అవి కూడ ఏడుస్తున్నట్టు "ఛా !" యన్నవి ... అవును. ఆమె దుఃఖాన్నెవరర్థంచేసుకుంటారు ? చేసుకోగలరు ? ... తండ్రి ఆమెకి సంబంధంచూసాడు. వరుడు చదువుకున్నవాడు. విశాలభావాలు కలవాడు, బాగాడబ్బున్నవాడు ... మొదటి పెండ్లివాడేకాని అతనికి సుభ మూగదని తెలీదు ... ఆ సాయంకాలమే వధువుని చూసుకోవడానికి వస్తాడట "ఈ కపటం ఎంతవరకు దాగుతుందో, తుదకు ఎలా పరిణమిస్తుందో ఆమెకు తెలియనిదికాదు. అందుకే తండ్రితో "తనకిపెళ్ళివద్దనీ, తననిలా ఏకాంతంగా యుండనీయమని, తన మూలంగా ఎవరికీ ఎలాటి చిక్కులు తేవద్దనీ" వ్రాసింది. ఎన్నాళ్ళనుండో వెదుకుతున్న తన శ్రమ యీనాడు తీరబోతుంది ... జరిగే మార్పు ఆయనకీ తెలుసు. కాని ఏది ఏమైనా, సుభకి పెళ్ళౌంటూయైపోతేచాలు ... ...ఆ సాయంకాలం వరుడు సతీశుడువచ్చాడు ... ఎవ్వడూలేని ప్రేమ యీనాడు కనబరచింది తల్లి. సంతోషంగా చెల్లెండ్రు ముస్తాబుచేశారు ... సతీశుడామెను చూస్తూనే కళ్లుచెదరి యదిరిపడ్డాడు. అలాటి యందాన్ని అతనింతవరకు కలకత్తా, హుగ్లీనగరాలలో చూడలేకపోయాడు. నేడిక్కడచూస్తున్నాడు. వినీలాకాశంలో చిన్నమబ్బు తెరలా ఆమెముఖంలో యలుముకున్న దుఃఖితమేఘాన్ని చూచి అతను జాలిచెందాడు. వివాహమై దూరమగుటచే దుఃఖిస్తుందని, యంతేగాని యీమెకులోటేమిటనీ తలపోసాడు ... ఆరోజే తన మిత్రుడికి జాబువ్రాస్తూ యిలా వ్రాసాడు. "నేను యీరోజూనే హరిపురంలో వధువుని చూసాను. ఆమె అందాన్ని నేను వర్ణించలేను. కాని అలాటి రూపం యీలోకంలో దుర్లభమని చెప్పగలను —"

ఆ సాయంకాలము ఆమెను చూస్తూనే గోపి యామె దుఃఖాన్ని పసిగట్టేశాడు. అతనంతకుముందే ఆసంగతి కర్ణాకర్ణిగ వినియున్నాడు. ఆమె నిశ్శబ్దమై కూర్చుంది. అతను మెల్లగా కదిలించి సంగతంతా చెప్పియడిగాడు. ఆమె యౌనని తలూపింది. "సుభా! నన్ను విడిచి వెళ్లిపోతావా ! నన్ను మర్చిపోతావా!" యని యన్నాడు యామె విషణ్ణవదనంచూసి ఆమె ముఖం శరత్కాలమేఘావృతమైంది. ఆమె మాట్లాడలేదు. "సుభా ! నాకు తెలుసు. నువ్వునన్ను మర్చిపోవు. కాని నన్ను విడిచిపోతున్నావు ... నాకు యిక నీలాటినేస్తాలు ... ఎలాటినేస్తాలు దొరకరు. నేనొంటరివాడనైపోతాను. నీతో మాట్లాడుతుంటే నీ సన్నిధానంలో నాకు స్వర్గంలో తేలినట్టుంటుంది. సుభా... యీకాల్వలోని చేపలు, ఈ నదిలోని అలలు, యీచెట్ల ఆకులు, ఆకుల మధ్య పువ్వులు... అన్నీ దుఃఖిస్తాయి, నువ్వు వెళ్ళిపోతే, సుభా ... రాత్రి నాకొక కలవచ్చింది. నువ్వు ఎందుచేతనో వచ్చిరావడంతోనే యీనదిలోకి దూకావట నీ వెంటనేనూ దూకాను. నువ్వు చేరగానే యీ కొలనంతా స్వర్ణమయమైంది; రత్నాల వెలుగులతో, కెంపుల మిలమిలలతో, ముత్యాల కళకళలతో అక్కడొక మహామండపంలో కప్పలు, చేపలు, పాములు జలగలు సారలు అన్నీ కొలువుతీర్చి నిన్నుకొలుస్తు

న్నాయి. నువ్వొక నవరత్నాల సింహాసనంమీద కూర్చుని దేవతలా వెలిగిపోతున్నావు. ఆ సమయంలో నేనెంతో ఆశతోనే నీ దగ్గరికి వచ్చాను... కాని నేనుయడుగుపెట్టీ పెట్టగనే అదంతామాయమైంది. స్వర్ణమయ సరోవరమంతా ఎక్కడమాయమైందో ఏమో, ఈదురుకప్పల బెకబెకలతో, చిరుచేపల కకవికలతో మళ్లీ యీనది కనుపట్టింది. నేను లేచి ఆలోచించాను. సుభా నువ్వొక శాంతి దేవతవు. బంగారుకన్నెవు. కరుణామయివు. నీ సముఖంలో, నీ ముఖంలో, నీచేతలో నీమాపులో ... వెలుగు, చీకటిని పారద్రోలే వెలుగు" అతని మాటలతో, అంత దుఃఖంలోనూ ఆమె పక్కున నవ్వింది. ఆమె నవ్వులోని యాంతర్యమాయభాగ్యున కర్థమవలేదు. ఆమె యిసుకలో యిలా వ్రాసింది.

"ఓ, అభాగ్యుడా! ఎందుకలా తీయనికలలతోను, యూహలతోనూ మురిసిపోతుంటావు. యూహకీ, చేతకీ భేదం యనంతం. యూహలోని మధురానుభూతి చేతలోయుండదు ... నేనికనీకు కనబడను. నేను వెళ్లిపోతున్నాను. యీరాత్రికే మేము కలకత్తానగరం వెళ్లిపోతున్నాము ... నీ తోటిచెలిమి యీ పరిసరాల మమతలోని మాధుర్యాన్ని నా మిత్రులయనురాగంలోని అనుభవాన్ని విడిచి వెలుగులోంచి చీకటికి వెళ్లిపోతున్నాను. నన్నుమర్చిపోకు. యీ అక్క నిత్యమూనిన్నుస్మరిస్తుందనే నమ్ము—"

ఆ దౌర్భాగ్యుడది పూర్తిగ చదవలేక పోయాడు. కళ్ళలోని యశ్రుజవనికలు ఆ చూపులనికప్పివేసాయి. ఆమె చేతులలో తలయుంచి వలవల యేడ్చాడు. ఆ యిసుకలోని యీ వ్రాతలని చెరపి తను మళ్లీ వ్రాసాడు.

"ప్రియతమమైన అక్కా! అగాధమైన నీ మనసులోని, నీ మాపులోని, నిగూఢమైన, ఆ ప్రగాఢ ప్రేమను ఎవరు గుర్తిస్తారు? ఎవరు గుర్తించారు? గుర్తించిన నన్ను విడిచి వెళ్ళిపోతున్నావు. తెగిన బంధంలో యనుబంధపు మనోబంధం, రాగబంధమయి నవోదయమవాలనే నేను వాంఛిస్తున్నాను."

ఆ మాటలామె హృదయఫలకంపై చెరుగని శిలాక్షరాలుగ లిఖితమైనాయి.

♦ ♦ ♦

కలకత్తా నగరంలో మూడు రోజుల యధిక ప్రయాసలతో సుభ పెళ్ళయిందనిపించాడు హరిహరరాయు. సుభియూగయని తెలియకుండా యుంచేందుకు హరిహరరాయు, కీర్తిప్రియ పడినపాట్లు సర్వేశ్వరుడుగూడ యెరుగడు. ఎవరూ ఆమె నడుగలేదు. ఆమె నేమనీ యడుగకుండా, చందమామను ధిక్కరించే ఆమె ముఖంలోని వెలుగు వారిని మంత్రముగ్ధుల్ని చేసేసింది. మాట్లాడబోయి పలుకలేకపోగా, సిగ్గు, బిడియమేమోయనుకున్నారు. పెళ్ళయిపోయింది. సుభకి చెప్పవలసినదిచెప్పి, తలిదండ్రులు హరిపురం వెళ్ళిపోయారు. వరుని తరఫువారంతా వధువుని తీసుకుని దిఘడాగ్రామం వెళ్ళిపోయారు. ఆమెలోన దాచలేకపోయింది. ఆమె నిష్కల్మష హృదయం పతిని మోసగించడానికి సుముఖత్వం చూపలేకపోయింది. ఆ నాటిరాత్రి తన చరిత్రంతా వ్రాసి పతి పాదాలచెంతబడి క్షమాభిక్ష వేడుకున్నది. అతనది చదివి నిర్ఘాంతపోయాడు. కట్టుకున్న మేడలు కూలిపోగా, శిథిలాలనిచూసే దౌర్భాగ్యునిలా యామె వంక చూసాడు. ఆ నాడు ఆమె ముఖంలోని దుఃఖజీర యిప్పుడతనికి కన్ను నలిపింది. పట్టరానికోపంతో ఆమెని దూషించాడు. ... ఈ సంగతి తని తల్లికీ, మేనత్తకీ తెలిసింది. వాళ్ళ దూషణాలకీ. తిరస్కారాలకి సుభ గురియైంది. ఎంతమంది ఎంత తిట్టినా, తుదకు కొట్టినా, దూషించినా ఆమె జవాబు ఆ చూపు...అదే! ఆ జాలిచూపు, ఆ చూపు నెవరూ యర్థంచేసుకోలేరు. చేసుకునేశక్తి వీళ్లకులేదు ... అదేయుంటే వాళ్లీ యంతస్తు దాటిపోతారు ... భర్త సేవచేస్తుంది. అత్త, పిన్నిగార్లకు సేవలు చేస్తుంది ... కాని పుట్టింటిలోలాగ యిక్కడా ఎవరూ మాట్లాడకపోగా రోజూ వందమార్లు తిడు

(609.వ పేజి చూడుడు)

(568—వ పేజీ తరువాయి)

తుంటారు. ఏవేవో ప్రయత్నాలని ప్రారబ్ధాలని యంటుంటారు. ... భర్త యాదరించడు. కనీసం దగ్గరకి వెళ్ళినా చీదరించుకుంటాడు. ... ఆ ప్రకృతి, ఆ పరిసరాలు, ఆ చెలిమిలోని యాంతర్యాలు ఏమైనాయి ... యిదేనా తనకిక శాంతి! యిదేనా తనకిక గమ్యం! ... ఆమె యక్కడ యుండగనే ఆ సతీశుని రెండవ వివాహమునకు ప్రయత్నాలు సాగించారు ... మూడురోజులామె యాయింటిలో యొంటరిగాయుంది ... మూడవనాటి రేయిఅంతా మహా వైభవంగా యింటికి వచ్చారు. నవవధువు యింట యడుగుపెట్టింది ... యింట్లో ఎక్కడా సుభ కనబడలేదు. అంతా వెదికారు. ఎక్కడాలేదు. అత్తగారి చిరాకు సతీశుని కోపం ఎక్కువైంది. కేకలు వేస్తూ పిలిచారు. పెరట్లో ... పండువెన్నెల వెలుగులో, బావిలో ... నిశ్చలమైన నీటిమధ్య ఆమె ప్రశాంత వదనంతో నిర్జీవియై తేలుతున్నది. నలుగురూచేరి ఆమెను పైకి తీసారు. సతీశు డొక్కసారి రెండు చేతులలో ముఖంకప్పుకుని తన గదిలోనికి పరుగెత్తాడు. మంచంపైబడి బోరున ఏడ్చాడు ... బ్రతికుండగా యొక్క కన్నీటి బొట్టుని ఆమెపై చిదపడానికి యిష్టపడని సతీశుడు యిప్పుడు ఆమె స్మృతిని కన్నీటిమయం చేస్తున్నాడు ... పెళ్ళికి పూర్వం, హరిహరుని మాటతో వధువు నిమిత్తం యొక పెద్దవీణ కొనియుంచాడు సతీశుడు...అప్రయత్నంగా యతని దృష్టి దానిపైబడింది. రేగినగాలి దుమారానికి అది ఎగిరి క్రిందపడిపోయింది. తీగలు ఖంగ్ మని మ్రోగి తెగిపోయినై. వీణ ముక్కలు ముక్కలుగా భగ్నమైంది. శిథిలమైన విపంచికేసి చూస్తూ యలానే నిశ్చేష్టుడైపోయాడు. తలగడజారి దాని క్రింద సుభ యుంచినలేఖ జారిపడింది.

"ప్రభూ! నన్ను క్షమించండి! నా వలన మీరు కష్టాలుపాలవడం నా కిష్టంలేదు ... నేనన్ని విధాల మీకు తగనిదానిని. మీరు పాలకులు నేను పాలితురాలిని. మీరు ప్రభువులు నేను భిక్షువును. కాని వసంతంలో ఎండిన పుష్పం, మధువులేని పుష్పం ... తీగలు తెగినవిపంచి ... భగ్నమైన హృదయం ..." ఆ దేవతామూర్తి లిఖితాక్షరాలు యతని నికృష్టనయనాలకి గోచరితముకాలేదు. కన్నీటి పొరలు యొక్కొక్కటే అతని కళ్ళను కప్పివేసినై.

(టాగూర్ రచన ఆధారంగా.)

కేసరిగారి

శ్రీ ఫలాది పానకం

గర్భమునందు, నోటియందు మేహజబ్బులవల్ల, యితర కారణములవల్ల పుండగుట, చీము నెత్తురుతో మలము వెలువడుట, నీళ్ల విరేచనములను నివారించును. గ్రహిణిజబ్బులు, అతిసారము, కడుపునొప్పితోకూడిన జిగట విరేచనములను నమ్మకముగా కుదుర్చును.

వెల రు. 1.60

కేసరి కుటీరం ప్రైవేట్ లిమిటెడ్

మద్రాసు — 14.